క్లుప్తంగా

కలెక్టర్‌కు కౌన్సిలర్ల శుభాకాంక్షలు



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ పరిష్కస్తానని హామీ ఇచ్చారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

జూలూరుపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లు, పెండింగ్ ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ జె.వసంతకుమార్, ఎస్సై పోటు గణేష్, ఏఎస్సైలు మధులత, తిరుపతిరావు, హెడ్ కానిస్టేబుల్స్ శివాజీ గణేష్, వెంకటేశ్వర్లు, దయానంద్, సైదమ్మ, కానిస్టేబుల్స్, హోమ్ గార్డులు పాల్గొన్నారు.

పుస్తకాల సేకరణ

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో చదువుకునే విద్యార్థులకు పోటీపరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను పూర్వవిద్యార్థుల నుంచి సేకరిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఇప్పటికి రూ.పది వేల విలువ కలిగిన పుస్తకాలను సేకరించడం జరిగిందన్నారు. మరోసారి ఈనెల 10, 11వ తేదీల్లో ఇంటింటికి వెళ్లి పుస్తకాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. నా నుంచి ఒక మంచి పుస్తకం ఇవ్వగలగాలి అనే స్ఫూర్తితో దాతలు ముందుకు రావాలని ప్రిన్సిపాల్ కోరారు.

పోస్ట్ మ్యాన్‌కు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): బీపీఎంగా పనిచేస్తూ పోస్ట్ మ్యాన్‌గా ప్రమోషన్ పొందిన జే.కిరణ్‌కుమార్‌ను, రామవరం పోస్టాఫీస్‌లో పోస్ట్‌మ్యాన్‌గా పనిచేస్తూ దమ్మపేటకు బదిలీపై వెళుతున్న రాజేంద్రప్రసాద్‌లను బుధవారం రామవరం పోస్టాఫీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏఎస్పీ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థల్లో పదోన్నతులు, బదిలీలు తప్పవని, ఎక్కడ ఉద్యోగం వచ్చినా అక్కడి ప్రజలతో మమేకం అయ్యేవారికి సేవలందించటమే మన విధి అని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం మాచర్ల రమేష్, మెయిల్ ఓవర్‌సెల్ సత్యనారాయణ, కొత్తగూడెం పోస్ట్‌మాస్టర్ సంతోష్, ఎస్‌సీపీ బిల్డింగ్ ఎస్‌పీఎం టి.రూబెన్, బీపీఎంఎస్, ఏబీపీఎంఎస్, ఎస్‌ఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బ్యాంకు డిపాజిట్ అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: కొత్తగూడేనికి చెందిన యోగా భారతి గ్రూప్ సభ్యురాలైన గౌతమి భర్త రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. వారి కూతురు వీణకు రూ.1.33 లక్షలు ఆర్థిక సహాయాన్ని బుధవారం గురువు నర్సింహారావు ఎస్‌బీఐ గణేష్‌బస్తీ మేనేజర్ ఎస్.బాలకృష్ణతో కలిసి అందజేశారు.

వితరణ

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామ పంచాయతీకి యల్లంకి నారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం అందజేశారు. నారాయణ కుమారులు యల్లంకి మధుసూదన్‌రావు, నాగేశ్వరరావు, అప్పారావులు జూలూరుపాడు ఎంపీఓ డి.రామారావు, సర్పంచ్ గుండెపిన్ని విజయలకు ఫ్రీజర్ బాక్స్‌ను వితరణగా అందజేశారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: టీపీఎల్ హరిప్రియ కప్ సీజన్2 క్రికెట్ టోర్నమెంట్ జనవరి 5 నుంచి 15 వరకు టేకులపల్లి హైస్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో ప్రారంభం అవుతుందని నిర్వాహకులు జాటోత్ నరేష్, టి.ప్రవీణ్, బి.సందీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 జట్లు పోటీ పడతాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు నగదు, ద్వితీయ రూ.30వేలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- గణనీయంగా పెరిగిన దిగుబడి
- నిబంధనలతో అన్నదాతల ఇక్కట్లు
- మద్దతు ధర పెంచాలంటున్న రైతులు



పడమటనర్సాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తాలను లోడ్ చేస్తున్న హమాలీలు

జూలూరుపాడు: మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం, కాకర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం ఈ ఏడాది మండలంలో 3,378 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేయగా, గత ఏడాది 3,417 ఎకరాల్లో సాగయింది. గతేడాది కంటే 39 ఎకరాల విస్తీర్ణం తక్కువగా సాగైనప్పటికీ దిగుబడి గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌ల్లో నీటి సామర్థ్యం పెరగడంతో వరి సాగు చేశారు. సన్నం రకం వరి ఎకరానికి 25–35 క్వింటాళ్లు, ముదుగులు(మొద్దులు) రకం ఎకరానికి 40–45 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రైతులకు తేమ శాతం అధికంగా ఉందని, ఆరబెట్టాలని చెపుతుండటంతో ఆరబోయటానికి పట్టాలు కూడా తెచ్చుకుని రోజుల తరబడి రాత్రి పూట కాపలా ఉండాల్సి వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు. తాలు, మట్టిపెడ్డలు ఉన్నాయని యంత్రాలు లేదా కూలీలతో గ్రేడింగ్ చేయించాల్సి రావడంతో అదనపు ఖర్చు అవుతోందని రైతులు లబోదిబోమంటున్నారు. హమాలీలు, రవాణా ఖర్చులు కూడా భరించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,060 గిట్టుబాటు కావడం లేదని చెపుతున్నారు. పొలం నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించే దగ్గర నుంచి అమ్మిన తరువాత కూడా లారీలకు లోడ్ చేసేంతవరకు తామే బాధ్యత వహించాల్సి వస్తోందని రైతులు చెపుతున్నారు. సహకార సంఘం వారు కేవలం బస్తాలు ఇస్తున్నారు కానీ పురుకోస ఇవ్వడం లేదన్నారు. అకాల వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు సడలించాలని అన్నదాతలు కోరుతున్నారు. స్థానిక సహకార సంఘం 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 431 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.



ధాన్యాన్ని గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

నిబంధనలతో ఇబ్బంది



నిబంధనల కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. తేమ శాతం 16–17 లోపే ఉండాలని, తాలు, మట్టిపెడ్డలు ఉంటే గ్రేడింగ్ చేయాలని చెబుతున్నారు. తేమ 17 శాతానికి మించితే ఆరబెట్టాల్సి వస్తోంది. సహకార సంఘం వారు బస్తాలు ఇస్తున్నారు కానీ పురుకోస ఇవ్వడం లేదు.

– బానోత్ రాంజీ, సాయిరాంతండా రైతు

అదనపు ఖర్చు అవుతోంది



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే అదనపు ఖర్చులు అవుతున్నాయి. తాలు, మట్టి పెల్లలు ఉన్నాయని గ్రేడింగ్ చేయమంటున్నారు. కూలీలు, మిషిన్ ఖర్చులు భరించాల్సి వస్తోంది. తామే పట్టాలు తెచ్చుకోవాల్సి వస్తోంది. హమాలీల ఖర్చు, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులు కూడా తామే ఇవ్వాల్సి వస్తోంది.

– దుద్దుకూరి దామోదర్, వెంగన్నపాలెం రైతు

నిబంధనల మేరకే కొనుగోళ్లు



ప్రభుత్వ నిబంధనల మేరకే వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నాము. 1000 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 431 మెట్రిక్ టన్నులు సేకరించాం. బస్తాల కొరత లేదు. ఇప్పటివరకు 10 వేల బస్తాలు రైతులకు ఇచ్చాం. మరో 10 వేల బస్తాలు అందుబాటులో ఉన్నాయి.

– ఎస్‌వీ రమణారెడ్డి, సీఈఓ పీఏసీఎస్ జూలూరుపాడు

చిరువ్యాపారులను ఆదుకుంటాం



కూల్చివేసిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): పేదలకు, చిరు వ్యాపారులకు ఏ కష్టమొచ్చినా సీపీఐ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని వివాదస్పద కూరగాయల మార్కెట్ ప్రాంగణాన్ని బుధవారం ఆయన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషతో కలిసి సందర్శించారు. వ్యాపారుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పేదల బతుకులను విధ్వంసం చేయడం సరైంది కాదన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, అయితే నిధులు మంజూరైనా నిర్మాణాలు చేపట్టకుండా నెలల తరబడి ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులు చెప్పాలన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అర్ధరాత్రి కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యుడు కంచర్ల జమలయ్య, గెద్దాడ నగేష్, భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, వ్యాపారులు పాల్గొన్నారు.


గ్రంథాలయం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న హరిసింగ్ నాయక్

టేకులపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు అని వాటిని సద్వినియోగం చేసుకుంటే ప్రతిఒక్కరూ జ్ఞాన వంతులుగా మారుతారని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ పేర్కొన్నారు. టేకులపల్లి మండల కేంద్రంలోని లచ్చతండాలో ఎల్‌టీఎస్‌టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్మాణానికి గ్రామస్తులు భూక్యా పూల్యా, భూక్యా ద్వాలియా, భూక్యా నందా లైబ్రరీ కోసం స్థలాన్ని దానం చేశారు. ఎమ్మెల్యే బానోతు హరిప్రియ సీడీఎఫ్ నుంచి రూ.14లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు బుధవారం లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. హరిసింగ్ నిర్వాహకులను, స్థల దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాలకృష్ణ, సర్పంచ్ గుగులోత్ ప్రియాంక, అసోసియేషన్ బాధ్యులు, గ్రామపెద్దలు, బానోతు రామ, బోడ గన్నా, గుగులోత్ మోతీలాల్, గుగులోత్ నరేందర్, భూక్యా గన్నా, లక్‌పతి, నర్సింగ్, వెంకన్న, నాకా రవి, జాటోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరబాబు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరక్టర్, డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గడల శ్రీనివాస్ జనవరి 7న కొత్తగూడెంలో ఏర్పాటు చేయనున్న, మెగా జాబ్‌మేళా కరపత్రాలను బుధవారం కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు అయన కార్యాలయంలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎస్ఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ మోదుగు జోగారావు, ట్రస్ట్ మేనేజర్ చంద్రగిరి, అంజి, ప్రభాకర్, ట్రస్ట్ సభ్యులు కంకణాల ఉజ్జీవ్‌రావు, లావుడ్యా నరేష్ పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందం



ఇల్లెందు: మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: 18 నెలలుగా ఎదురు చూస్తున్న వేతన సవరణ ఒప్పందం ఎట్టకేలకు కలకత్తాలో జరిగిన సమావేశంలో కోలిండియా యాజమాన్యం అంగీకరించటంతో గ్రహణం వీడిందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య అన్నారు. బుధవారం ఇల్లెందులోని జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో సారయ్య మాట్లాడారు. మెరుగైన వేతన ఒప్పందం జరిగిందని అలవెన్సుల మీద ఎల్టీసీ, ఎల్ఎల్టీసీ, లీవుల పెంపుదలపై చర్చల తర్వాత పూర్తిస్థాయిలో అగ్రిమెంటు జరుగుతుందని తెలిపారు. కొంతమంది అవగాహన లేని నేతలు వేజ్‌బోర్డు అగ్రిమెంట్ మీద తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులను మభ్యపెట్టి జాతీయ కార్మిక సంఘాలను విమర్శించటం లక్ష్యంగా పెట్టుకున్నట్లు విమర్శించారు. ఇది జాతీయ కార్మిక సంఘాల కృషి ఫలితమేనన్నారు. సమావేశంలో దాసరి రాజారామ్, సంజీవచారి, గడదాసు నాగేశ్వరరావు, గాలీబ్ సాహెబ్, జక్కుల శ్రీనివాస్, లింగన్న, తిరుమలరావు, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

ఇది కార్మికుల విజయం...

సింగరేణి(కొత్తగూడెం): డీపీఈ గైడ్‌లైన్లు పక్కన పెట్టించి రానున్న ఐదేళ్ల కాలానికి 19శాతం ఎంజీబీని సాధించి పెట్టిన ఘనత సీఐటీయూదేనని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మందా నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గుగని కార్మికుల 11వ వేతన సవరణ ఒప్పందంపై మంగళవారం కలకత్తాలో జరిగిన సమావేశంలో 19శాతం జీతం కనీస పెరుగుదల సాధించటాన్ని కార్మికుల విజయంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

6న సీపీఐ జనరల్ బాడీ సమావేశం

ఇల్లెందు: ఈ నెల 6వ తేదీన సీపీఐ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు బంధం నాగయ్య, ఉదుత ఐలయ్య బుధవారం ఇల్లెందులో విలేకరులకు తెలిపారు. మాట్లాడుతూ.. పట్టణంలోని ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వే బ్రిడ్జి కాంటాల తనిఖీ

సుజాతనగర్: ప్రైవేట్ పత్తి వ్యాపారుల వద్ద గల రెండు వే బ్రిడ్జి కాంటాలను జిల్లా తూనికల కొలతల శాఖాధికారి కూచన మనోహర్ బుధవారం తనిఖీ చేశారు. ప్రధాన రహదారి పక్కనున్న కాంటా, రాళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వే బ్రిడ్జిలలో 5 కిలోల మేర హెచ్చుతగ్గులు రావడం గుర్తించామని, ఇది సహజమేనని తెలిపారు. మోసాలకు పాల్పడిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా తివారీ



మనోహర్ తివారీకి స్వీట్ తినిపిస్తున్న హరిసింగ్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ నగల వ్యాపారి మనోహర్ తివారీని ఎన్నుకున్నారు. బుధవారం తివారీకి క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ ఎంపిక ప్రకటించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఇల్లెందురూరల్: కొమ్ముగూడెం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇల్లెందు పట్టణానికి చెందిన కాంటా కార్మికుడు రజాక్ ఇల్లెందు నుంచి గుండాలకు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో నేరుగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రజాక్ తీవ్రంగా గాయపడగా.. ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. రజాక్‌ను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి సిఫారసు చేశారు.

మహిళకు తీవ్ర గాయాలు..

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. బుధవారం తడికలపూడి రోడ్డులో ఆటో బైక్ ఢీకొన్నాయి. మంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే ప్రభుత్వాస్పత్రి సందర్శన



బాలింతకు కేసీఆర్ కిట్ అందజేస్తున్న హరిప్రియ

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి సాధించాల్సి ఉందని ఇందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. బుధవారం ఆస్పత్రిని సందర్శించి రెండు రోజుల క్రితం జరిగిన ఆపరేషన్ బాలింతను పరామర్శించారు. ఆపరేషన్ డాక్టర్ సింధు, వైద్య సిబ్బందిని అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం ఈ ఆస్పత్రి వైద్య విధాన పరిషత్‌కు మారిన తర్వాత ఆరుగురు ప్రత్యేక వైద్య నిపుణులను నియమించినట్లు తెలిపారు.

వైద్యాధికారులకు శిక్షణ

చుంచుపల్లి: విధుల్లో చేరిన వైద్యాధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జేవీఎల్ శిరీష ఆదేశించారు. బుధవారం డీఆర్డీఏ కార్యాలయంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారులకు శిక్షణ నిర్వహించారు. వైద్యాధికారులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేవిధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. గర్భిణుల నమోదు సకాలంలో నిర్వహించాలని, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు, విష జ్వరాలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాసరావు, బాలాజీ నాయక్, మణికంఠరెడ్డి, పర్షియా నాయక్, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

ముగిసిన టీపీఎల్ క్రికెట్ టోర్నీ



కప్ అందుకుంటున్న విజేత వెంకట్యాతండా జట్టు

టేకులపల్లి: డిసెంబర్ 20న ప్రారంభమైన టీపీఎల్ ప్రీమియర్ లీగ్ సీజన్6 క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. వెంకట్యాతండా, న్యూస్టార్11 జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరా హోరీగా కొనసాగింది. డ్రా కావడంతో సూపర్‌ఓవర్‌తో వెంకట్యాతండా జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.30వేలు (జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య వితరణ), ద్వితీయ రూ.20వేలు (నోముల భానుచందర్, బోడ సరిత, భూక్యా రాధ, లక్ష్మణ్‌నాయక్‌ల వితరణ), షీల్డులు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ భూక్యా రాధ, సర్పంచ్‌లు పూనెం ఉమ, బోడ సరిత, బోడ నిరోషా, విద్యుత్ ఏఈ దేవా, బీఎస్ఎన్ఎల్ డీఈ నక్రు, టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.హతీరాం, బోడ మంగీలాల్, నిర్వాహకులు ఇస్లావత్ సాయి, రాయల ప్రశాంత్, నోముల భానుచందర్, నామానాయక్, లక్‌పతి, హుస్సేన్, పూల్‌సింగ్, సందీప్, కిరణ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో గుణాత్మక మార్పు



ప్రదర్శనను తిలకిస్తున్న తహసీల్దార్, ఎంపీపీ, ఎంఈఓ

టేకులపల్లి: విద్యార్థుల్లో గుణాత్మక మార్పు, సృజనాత్మకత పెంపొందించేందుకు బోధనోపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయని టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధ, తహసీల్దార్ కేవీ శ్రీనివాస్‌రావు, ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్ అన్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బోధనోపకరణాల ప్రదర్శన (టీఎల్ఎం మేళా)ను వారు ప్రారంభించారు. మండలంలోని 6 కాంప్లెక్స్‌ల పరిధిలోని 69 పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని విద్యార్థుల్లో గుణాత్మక మార్పు కోసం చేస్తున్న వినూత్న ప్రయత్నమే టీఎల్ఎం అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడ నిరోషా, ఎస్ఎంసీ చైర్మన్ హరికిషన్, ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ ఎ.జగన్, కాంప్లెక్స్ హెచ్ఎం జి.భద్రు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందిస్తున్న సతీష్

కొత్తగూడెంటౌన్: పాత కొత్తగూడెం జిల్లా సంక్షేమ శాఖ, మహిళాభివృద్ధి, శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జన్మదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి (డీబ్ల్యూఓ ఐసీడీఎస్ పీడీ) జేఎం స్వర్ణలత లెనీనా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. బ్రెయిలీ అంధుల కోసం కనిపెట్టిన లిపి ద్వారా అంధులు ఎంతోమంది ఉన్నత శిఖరాలను అధిరోహించినట్లు చెప్పారు. జిల్లాలో అంధుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, డిగ్రీ ఆపై చదువుకున్న వారికి ల్యాప్‌టాప్‌లు, అంధ విద్యార్థులకు బ్రెయిలీ కిట్‌ను అందజేస్తున్నామన్నారు. కార్య ఎం.నరేంద్ర, ఉపేంద్రమ్మ, కె.రమణయ్య, నందకిశోర్, రాజ్‌కిరణ్, నందకిశోర్, దివ్యాంగుల సంఘం సభ్యులు జి.సతీష్, ఎల్‌వీ ప్రసాద్ కంటి సిబ్బంది, స్వర్ణలత, జ్యోతి, సిబ్బంది వరప్రసాద్, నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

టీవీపీఎస్ ఆధ్వర్యంలో..

అంధులకు అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలీ అని తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ అన్నారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని ఆ సంఘం కార్యాలయలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రుగొండకు చెందిన బేగంబీ అనే దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ను అందజేశారు.

బీసీ గురుకులం సందర్శన



పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, ప్రిన్సిపాల్

టేకులపల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులం పాఠశాలను బుధవారం టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధ సందర్శించారు. అన్నం, కూరలను పరిశీలించారు. పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ పాటించాలని, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మట్టి పోయించి చదును చేయించాలని ప్రిన్సిపాల్ ఎంపీపీని కోరారు. ప్రిన్సిపాల్ చైతన్య, వార్డెన్ కవిత, పీఈటీ లచ్చులాల్, భూక్యా సైదులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పెట్రాంచెలక బ్రిడ్జికి మోక్షమెన్నడో..?

టేకులపల్లి మండలం పెట్రాంచెలక గ్రామంలోకి వెళ్లాలంటే వాగుపై చప్టాను దాటి వెళ్లాలి. ఇది బాగా లోలెవెల్ ఉండటంతో వర్షం వస్తే చప్టా మీది నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వరద తగ్గే వరకు రాకపోకలు నిలిచిపోవాల్సిందే. పాలకులు, ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా, దశాబ్దాలుగా ఆదివాసీలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ఏళ్ల తరబడి ఆదివాసీలు కోరుతున్నా.. నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, ఏఈ పీఆర్ టేకులపల్లి
సెల్ నంబర్ : 9676029621